క్లుప్తంగా

కాంగ్రెస్ పార్టీ మండల సమన్వయ కమిటీ ఏర్పాటు

కోదాడరూరల్ : ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ కోదాడ మండల సమన్వయ కమిటీని బుధవారం మండలంలోని గుడిబండలో ఏర్పాటు చేసుకున్నారు. అధ్యక్షుడిగా గుడిబండకు చెందిన తూమాటి వరప్రసాద్‌రెడ్డి, సభ్యులుగా చిమిర్యాల నుంచి కొత్త గుర్వయ్య, కూచిపూడి నుంచి మండలపు శేషు, గణపవరం నుంచి ఇర్ల సీతారాంరెడ్డి, తొగర్రాయికి చెందిన అమరనాయిని వెంకటేశ్వరరావు, కాపుగల్లుకు చెందిన తొండపు సతీష్, రేవూరి వెంకటాచారి, నల్లబండగూడెంకు చెందిన బెంజిమెన్, ఎర్రవరంనకు చెందిన భాష బోయిన భాస్కర్‌రావు, దోరకుంటకు చెందిన గద్దల వెంకటేశ్వర్లు, బీక్యాతండాకు చెందిన భాషా, రామలక్ష్మీపురం నుంచి కొప్పుల సుభాష్‌రెడ్డిని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో పాత, కొత్తగా చేరిన కాంగ్రెస్ నాయకులను సమన్వయం చేస్తూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలనే ఉద్దేశంతో 12 మందితో కమిటీ ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు.

ఘనంగా ఏకలవ్య జయంతి



మాధవరంలో వేడుకల్లో పాల్గొన్న ఎరుకల సంఘం నాయకులు

మునగాల : మండలంలోని మాధవరంలో బుధవారం ఎరుకల సంఘం ఆధ్వర్యంలో ఏకలవ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకలవ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎరుకల సంఘం అధ్యక్షుడు కుంభం భిక్షం, ప్రధాన కార్యదర్శి కుంభం వీరకర్ణ, నాయకులు నల్లగొండ సాంబయ్య, కుంభం గోవింద్, కుంభం వెంకన్న, నల్లగొండ నాగమణి, కుంభం లింగమ్మ, కుంభం వెంకన్న, బక్కయ్య, చర్లపల్లి లింగయ్య, కుంభం శ్రీను పాల్గొన్నారు.

పేద మహిళ కుటుంబానికి చేయూత



అలివేలు కుటుంబానికి బియ్యం, సరుకులు అందజేస్తున్న నాగుల్‌మీరా

మఠంపల్లి : మండలంలోని చౌటపల్లిలో గల రాంరెడ్డికాలనీలో నివాసముంటున్న అలివేలు భర్త ఇటీవల చనిపోయాడు. తన ముగ్గురు పిల్లలతో ఉంటున్న ఆమె ఆర్థిక ఇబ్బందులు పడుతోంది. దీంతో హుజూర్‌నగర్ జోలాలీ పర్నీచర్ ప్రొప్రైటర్ నాగుల్‌మీరా బుధవారం ఆమెకు బియ్యం, నిత్యావసర సరుకులు, పిల్లలకు బుక్స్ అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.


పేదలకు సేవ చేయాలని ఆలోచించడం అభినందనీయం



మాట్లాడుతున్న ఉమేష్

హుజూర్‌నగర్ : పేదలకు సేవ చేయాలనే ఆలోచన రావడం అభినందనీయమని ఎస్‌ఐ ముత్తయ్య, ప్రియదర్శిని విద్యా సంస్థల చైర్మన్ పశ్య శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లో ఉమేష్ చంద్ర ఫౌండేషన్ ప్రారంభోత్సవంలో వారు పాల్గొని మాట్లాడారు. నిజాయితీ గల దివంగత ఐపీఎస్ అధికారి ఉమేష్ చంద్ర పేరు మీద ఫౌండేషన్ ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ముందుగా ఫౌండర్ తన్నీరు ఉమేష్ మాట్లాడారు. ఫౌండేషన్ అధ్యక్షుడు వినోద్, ఉపాధ్యక్షుడు రాకేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బాలవినయ్, కోశాధికారి సతీష్, మహేష్, రవీందర్, ములకలపల్లి రాంబాబు, కనకాంబరం, సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

సీసీ పనులకు నాణ్యత పరీక్షలు నిర్వహించాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ పరిధిలోని ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ సీసీ పనులకు క్వాలిటీ కంట్రోల్ అధికారులు నాణ్యత పరీక్షలు నిర్వహించాలని కోరుతూ ప్రజా కళాకారుడు బాదె నరసయ్య, ఓయూ జేఏసీ నాయకుడు సోమగాని నరేందర్‌లు డిమాండ్ చేశారు. పనులకు నాణ్యత పరీక్షలు నిర్వహించాలని వినతిపత్రం ఇచ్చి పదిరోజులైనా నీటిపారుదల శాఖ అధికారులు పట్టించుకోవడంతో బుధవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకొని చేతిలో ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో లింగం కృష్ణ, రేఖ సైదులు, సోమగాని నాగేశ్వరరావు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

● సాగుకు సమాయత్తం

చిలుకూరు : వర్షాలు కురుస్తుండడంతో వానాకాలం సీజన్ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. బేతవోలు, జెర్రిపోతులగూడెం, చిలుకూరు, చెన్నారిగూడెం, ఆచార్యులగూడెం తదితర గ్రామాల్లో చెరువులు, బావులు, బోర్ల కింద వరి నారుమడులు సిద్ధం చేసుకున్నారు. నారు 15 రోజులుగా పెరుగుతుండడంతో దుక్కులు దున్నే పనిలో రైతన్నలు నిమగ్నమయ్యారు. కొందరు రైతులు వెదజల్లే పద్ధతిలో సాగు చేస్తున్నారు. కాగా, సాగర్ ఆయకట్టు రైతులకు ప్రస్తుతానికి నీటి ఆధారం లేకపోవడంతో సాగుకు ఎలాంటి పనులు చేపట్టడం లేదు. ఆగస్టు నెలలోనైనా డ్యామ్‌లు నిండితే సెప్టెంబర్‌లో నాట్లు వేసుకోవచ్చనే ఆశలో ఉన్నారు.



చిలుకూరులో నాటుకు సిద్ధంగా ఉన్న నారుమడి



బేతవోలు రోడ్డులో వెదజల్లే పద్ధతిలో సాగు చేసిన వరి పొలం



జెర్రిపోతులగూడెం రోడ్డులో సాగుకు సిద్ధం చేసిన మడి

రోడ్లపై పశువులు.. ప్రమాదాలకు నెలవులు



హుజూర్‌నగర్‌లో రోడుపై పడుకున్న పశువులు



వాహనాలకు అడ్డుగా నిలబడిన పశువులు

- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- ప్రమాదాల బారిన పడుతున్న ప్రజలు, పశువులు
- పట్టించుకోని అధికారులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని ప్రధాన రోడ్డుపై పశువులు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. దీంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఆకస్మాతుగా పశువులు వాహనాలకు అడ్డుగా వస్తుండడంతో భయాందోళన చెందుతున్నారు. పశువులు రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతున్నా వాటిని పట్టించుకునే నాథుడు కరువయ్యారు. అవి నిత్యం రోడ్ల వెంట ఉన్న మొక్కలు, ఇతర ఆహార పదార్థాలను తింటూ రోడ్లపైనే పడుకుంటున్నాయి. దీంతో వాహనాలు ఢీకొట్టి గాయాలపాలవుతున్నాయి. నిత్యం రద్దీగా వాహనాలు తిరుగుతున్నా రోడ్లపై నుంచి వెళ్లడం లేదు. పశువుల యజమానులు వాటి గురించి ఏమాత్రం పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌అండ్‌బీ, మున్సిపాలిటీ అధికారులు కూడా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రమాదాలు, ప్రాణ నష్టం జరగక ముందే తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పశువులను రోడ్లపైకి వదిలితే గోశాలకు తరలిస్తాం



మున్సిపాలిటీ పరిధిలోని పశువులను యజమానులు తమ ఇళ్ల వద్ద కట్టేసుకోవాలి. గేదెలను, ఆవులను రోడ్ల మీదకు వదులుతుండడంతో వాహనదారులే కాకుండా పశువులు కూడా ప్రమాదాల బారిన పడుతున్నాయి. గేదెలు, ఆవులను రోడ్లపైకి వదిలితే ఎలాంటి సమాచారం ఇవ్వకుండా గోశాలకు తరలిస్తాం.

– మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి

తాడువాయిలో తగ్గుముఖం పట్టిన విషజ్వరాలు

మునగాల : మండలంలోని తాడువాయిలో గత పక్షం రోజులుగా విషజ్వరాలు ప్రబలి పలువురు గ్రామస్తులు అనారోగ్యంతో ఇబ్బందులు పడుతుండడంతో రేపాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గత ఆరు రోజులుగా వైద్యశిబిరం ఏర్పాటు చేసి వైద్యసేవలు అందిస్తున్నారు. దీంతో విషజ్వరాలు తగ్గుముఖం పట్టాయి. బుధవారం వైద్యశిబిరంలో 25 మంది తమ పేర్లు నమోదు చేసుకోగా ఇద్దరికి జ్వరం సోకినట్లు గుర్తించామని, మరొకరికి డెంగీ లక్షణాలు ఉన్నాయని, ప్రస్తుతం 9 మంది జ్వరంతో బాధపడుతున్నారని రేపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీశైలం తెలిపారు. కాగా, జిల్లా వైద్యారోగ్యశాఖ అడ్మినిస్ట్రేటివ్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా.పెండెం వెంకటరమణ, జాతీయ కీటక జనిత నివారణ సబ్ యూనిట్ అధికారి ఎం.సుదర్శన్ వైద్యశిబిరాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. వైద్యశిబిరంలో డాక్టర్ వైష్ణవి, డాక్టర్ వినయ్‌కుమార్, పీహెచ్.ఎన్ శారద, హెల్త్‌సూపర్‌వైజర్ శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్లు లింగం రామకృష్ణ, లింగయ్య, ఏఎన్‌ఎంలు సంగెపు సుచరిత, మమత, నరసమ్మ, లలిత, ఆశా వర్కర్లు మరియమ్మ, మయూరి, నాగమణి, రమణ, మాణిక్యమ్మ పాల్గొన్నారు.



తాడువాయిలో వైద్యసేవలు అందిస్తున్న సిబ్బంది

ఊరూరా పీర్ల సందడి



మునగాల : బరాఖత్‌గూడెంలో వేడుకల్లో పాల్గొన్న ముస్లింలు



మేళ్లచెరువు : వెల్లటూరులో పీర్లను ఊరేగిస్తున్న గ్రామస్తులు

మఠంపల్లి : మండల కేంద్రంతో పాటు పెదవీడు, బక్కమంతులగూడెం, రఘునాథపాలెంలతో పాటు పలు గ్రామాల్లో బుధవారం మొహర్రం వేడుకలను హిందూ ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్ల వద్ద ప్రత్యే ప్రార్థనలు చేసి అనంతరం పీర్లను గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. రఘునాథపాలెంలో వేడుకల్లో పాల్గొన్న మఠంపల్లి ఎస్‌ఐ రామాంజనేయులను పీర్ల చావిడిలో ఉత్సవ కమిటీ సభ్యులు సన్మానించారు. పీఏసీఎస్ చైర్మన్ రామచంద్రయ్య, ఉత్సవ కమిటీ సభ్యులు సయ్యద్ నిజామ్, బొగ్గుల బాలసైదా, మహబూబ్, కేసనపల్లి హుస్సేన్, ముజావరి గార్లపాటి జలాలుద్దీన్, ముస్లింలు, హిందువులు పాల్గొన్నారు.

చిలుకూరు : మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ముస్లింలు మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్లను ఊరేగించారు.

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెం, మాధవరం, నర్సింహులగూడెంతో పాటు పలు గ్రామాల్లో బుధవారం మొహర్రం వేడుకలను హిందూ, ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పీర్లను భాజాభజంత్రీలతో గ్రామాల పుర వీధుల్లో ఊరేగించారు. ప్రజలు పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి దట్టీలు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

గరిడేపల్లి : మండల కేంద్రంతో పాటు గానుగుబండ, కుత్బుషాపురం, కట్టవారిగూడెంలలోమొహర్రం వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేళతాళాల నడుమ పీర్లను ఊరేగింపు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో నిర్వాహకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నడిగూడెం : మండల కేంద్రంతో పాటు సిరిపురం, వల్లాపురం గ్రామాల్లో బుధవారం మొహర్రం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా డప్పు చప్పుళ్లతో పీర్లను వీధుల్లో ఊరేగించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ముస్లింలు, పాల్గొన్నారు.

మేళ్లచెరువు : మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్ల ఊరేగింపు నిర్వహించారు.

పిల్లల వికాసానికి అంగన్‌వాడీలు దోహదం



ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్

నేరేడుచర్ల : పిల్లల వికాసానికి అంగన్‌వాడీలు దోహదపడతాయని నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్ అన్నారు. బుధవారం మున్సిపాలిటీలోని 5వ వార్డులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అమ్మమాట– అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ తీశారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆర్.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ.. రెండున్నర ఏళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలన్నారు. టీచర్లు పుష్పమ్మ, ఆయా బుచ్చమ్మ, ఏఎన్‌ఎం సునిత, పాపారావు, నాగుల్‌మీరా, గర్భిణులు, బాలింతలు ఉన్నారు.

చెరువు ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

కోదాడరూరల్ : మండలంలోని తొగర్రాయిలో గల చింతకుంట చెరువు ఆక్రమణపై అధికారులు చర్యలు తీసుకోవాలని సంతాన వేణుగోపాలస్వామి ఆలయ కమిటీ చైర్మన్ అమరనాయిని వెంకటేశ్వరావు కోరారు. బుధవారం తొగర్రాయిలో మత్స్య సహకార సంఘం సభ్యులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చింతకుంట చెరువు తొగర్రాయితో పాటు చిలుకూరు మండలం సీత్లాతండా రెవెన్యూలో పరిధిలో ఉందని తెలిపారు.. సర్వే నంబర్ 642లో 54 ఎకరాల్లో ఉన్న చెరువు 22 ఎకరాలకు పైగా ఆక్రమణకు గురైందని తెలిపారు. సీత్లాతండా, నారాయణపురంనకు చెందిన కొందరు రైతులు దాదాపుగా 10 ఎకరాల్లో చెరువు మట్టిని తవ్వి శిఖం భూమిలో పోసి ఆక్రమించుకున్నారని ఆరోపించారు. గతంలో గ్రామం చుట్టూ 9 కుంటలు ఉండగా ఇప్పటికే ఎనిమిది ఆక్రమణకు గురయ్యాయని అన్నారు. చెరువును కాపాడుకోకపోతే భవిష్యత్‌లో నీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉందని తెలిపారు. రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ అధికారులు స్పందించి చెరువు ఆక్రమణదారులపై చర్యలు తీసుకొని, చెరువును కాపాడాలని కోరారు. సమావేశంలో ముదిరాజ్ సంఘం నాయకులు కన్నెబోయిన కొండలు, వీరయ్య, సత్యనారాయణ, ఏడుకొండలు, సింగారయ్య, ఉపేందర్, సత్యం, గాంధీ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి వేడుకలు

మేళ్లచెరువు : తొలిఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం మేళ్లచెరువు మండల కేంద్రంలోని శ్రీ ఇష్టకామేశ్వరి సమేత శ్రీస్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పుణ్యావచనం, పంచామృతాభిషేకాలు, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి విశేష అలంకరణ, ఆశీర్వచనాలు, తీర్థప్రసాద వినియోగంతో పాటు ఓం నమః శివాయ నామాన్ని 24 గంటల పాటు పలికి ఏకనామ స్మరణ కార్యక్రమం నిర్వహించారు. అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



మేళ్లచెరువు : శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



నేరేడుచర్ల : సోమప్ప ఆలయంలో శివుడికి పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహ ఆలయంలో..

మఠంపల్లి : తొలి ఏకాదశి సందర్భంగా మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి బుధవారం తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయంలోని శ్రీపార్వతీరామలింగేశ్వరస్వామికి కూడా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ముఖమండపంలో స్థానిక భక్త మండలి సభ్యులు చేసిన భజనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు విశ్రాంత అర్చకులు పరాశరం నరసింహమూర్తి, భక్తులు పాల్గొన్నారు.



మఠంపల్లి : మట్టపల్లి ఆలయంలో స్వామివారి దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

మండలంలో..

మఠంపల్లిలో గల శ్రీవేణుగోపాలస్వామి ఆలయం, చౌటపల్లిలోని శ్రీరుక్మిణీసత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయం, పెదవీడులోని శ్రీరామాలయం, రఘునాథపాలెంలోని శ్రీకోదండరామస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

హుజూర్‌నగర్ : తొలి ఏకాదశి పర్వదినాన్ని బుధవారం హుజూర్‌నగర్‌లో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని వివిధ వైష్ణవ ఆలయాలకు వెళ్లి ప్రదక్షిణలు చేసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల పూజారులు, అధికారులు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ

నేరేడుచర్ల : తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా నేరేడుచర్లలోని శ్రీకోదండ రామాలయం, అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర ఆలయంతో పాటు సోమవరం గ్రామ పరిధిలోని సోమేశ్వర ఆలయాలకు బుధవారం పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించారు. భక్తుల రాకపతో ఆయా ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. కోదండ రామాలయంలో వేదపండితులు నర్సింహాచార్యులు, అన్నపూర్ణ విశ్వేశ్వరాలయంలో పూజారి ఉగ్రదండి శివప్రసాద్‌శర్మ, విజయ దుర్గాలయంలో ప్రధాన పూజారి మొలుగు శ్రీనివాసాచార్యులు, సోమప్ప ఆలయంలో పూజారి ఇరువంటి శ్రీనివాస శర్మ, దాసారంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన పూజారి హరి సురేష్‌శర్మలు వేదమంత్రోత్సవాల నడుమ సామూహిక అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాల స్వామి దేవాలయంలో బుధవారం తొలి ఏకాదశి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకం, సహస్రనామ ఫల పుష్పార్చన నిర్వహించారు. అర్చకులు ముడుంబై హరీష్‌కుమార్‌చార్యులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

చిలుకూరు : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బుధవారం తొలి ఏకాదశి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వర్షాలు బాగా కురవాలని, పంటలు సమృద్ధిగా పండాలని వేడుకుంటూ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

గరిడేపల్లి : మండలంలోని కీతవారిగూడెం, పొనుగోడు, కల్మలచెరువు, కానుగబండ, గడ్డిపల్లితో పాటు పలు గ్రామాల్లో బుధవారం తొలి ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

మోతె : మండలంలో బుధవారం తొలి ఏకాదశి పూజలు బుధవారం ఘనంగా నిర్వహించారు. రామాంజనేయ, వేణుగోపాలస్వామి, ఆంజనేస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.



హుజూర్‌నగర్ : రామాలయంలో..



చిలుకూరు : చెన్నకేశవ ఆలయంలో..



గరిడేపల్లి : పొనుగోడులోని వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న పూజారి

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

హుజూర్‌నగర్ : మండలంలోని బూరుగడ్డ గ్రామస్తులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బుధవారం హుజూర్‌నగర్‌లోని మంత్రి ఉత్తమ్ క్యాంపు కార్యాలయంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చక్ర వీరారెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో బూరుగడ్డ మాచవరం గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు యరగాని భిక్షం, గడ్డం నాగయ్య, బీసీ సెల్ అధ్యక్షుడు యరగాని గురవయ్య, నాగరాజు, వెంకన్న, లబ్ధిదారులు ఉదయ్, శ్యాంసుందర్, లక్ష్మి, బీబు, బారేమియా తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ సంబరాలకు ఏర్పాట్లు పరిశీలన

చిలుకూరు : ప్రభుత్వం రైతు రుణమాఫీ చేస్తున్న నేపథ్యంలో గురువారం సంబరాలు నిర్వహించేందుకు చిలుకూరు మండల కేంద్రంతో పాటు బేతవోలు, నారాయణపురం రైతు వేదికల్లో వ్యవసాయ అధికారులు చేస్తున్న ఏర్పాట్లను బుధవారం ఆర్డీఓ సూర్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణమాఫీ సంబరాల్లో రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. వ్యవసాయ అధికారి శ్రీధర్, ఏఈఓ శిరీష, సీసీ విక్రమ్, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్‌కార్డు ప్రామాణికంతో రైతులకు అన్యాయం

గరిడేపల్లి : రైతు రుణమాఫీలో ప్రభుత్వం రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకుంటే అర్హులకు అన్యాయం జరుగుతుందని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఆయన గరిడేపల్లిలో విలేకరులతో మాట్లాడారు. పట్టాదారు పాసుబుక్‌నే లెక్కలోకి తీసుకుని అర్హులైన రైతులందరికీ రుణ మాఫీ వర్తింపజేయాలని ఆయన కోరారు.

నేడు దేవతామూర్తుల ఊరేగింపు

నేరేడుచర్ల : పట్టణంలోని విజయదుర్గా దేవాలయంలో నూతనంగా నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయంలో ప్రతిష్ఠించబోయే విగ్రహాలను గురువారం ఉదయం 8:30 గంటలకు ఊరేగించనున్నట్లు ఆలయ నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి పంచలోహ విగ్రహంతో పాటు గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, మాలికాపురతోవమ్మ అమ్మవారి విగ్రహాలను ఊరేగించనున్నట్లు తెలిపారు. ఈ ఊరేగింపులో భక్తులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

● ఆషాఢమాస గోరింటాకు వేడుకలు



ఆషాఢమాసం సందర్భంగా మఠంపల్లి మండల కేంద్రంలోని శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో రెడ్డి పరివార్ మహిళా సంఘం ఆధ్వర్యంలో బుధవారం గోరింటాకు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఒకరికొకరు గోరింటాకు పెట్టుకున్నారు. – మఠంపల్లి

ఆరోగ్యశ్రీలో ఆపరేషన్‌కు కృషిచేస్తా

సాక్షి ఎఫెక్ట్

చిలుకూరు : చిలుకూరు మండల కేంద్రానికి చెందిన యువకుడు కస్తూరి సురేష్‌కు గుండె ఆపరేషన్ నిమిత్తం రూ.4 లక్షలకు పైగా ఖర్చు అవుతుందని, సామాన్య కుటుంబానికి చెందిన సురేష్ అంత ఖర్చు భరించే పరిస్థితిలో లేకపోవడంతో బుధవారం సాక్షి దినపత్రికలో 'ఆపదలో ఉన్నా ఆదుకోండి'అనే శీర్షికతో వచ్చిన కథనానికి ఆరోగ్య మిత్ర వెంకటేశ్వర్లు స్పందించారు. ఖమ్మంలోని వైద్యశాలకు వెళ్లి సురేష్‌తో మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. గుండె వాల్ 50 శాతం బ్లాక్ అయినట్లు నిర్ధారణ అయిందని, ఈవిషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆరోగ్య శ్రీ ద్వారా గుండె ఆపరేషన్ చేయించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ విషయంపై సురేష్ వద్ద నుంచి లిఖితపూర్వకంగా దరఖాస్తు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సురేష్ కుటుంబసభ్యులు సాక్షికి ధన్యవాదాలు తెలిపారు.



దరఖాస్తు తీసుకుంటున్న ఆరోగ్య మిత్ర వెంకటేశ్వర్లు

సత్ప్రవర్తనతో విజేతలుగా నిలుస్తారు



ఎస్‌ఆర్‌ఎస్ కళాశాల పేరెంట్స్ మీటింగ్‌లో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

మునగాల : విద్యార్థులు క్రమశిక్షణ, సత్ప్రవర్తన అలవాటు చేసుకుంటే జీవితంలో విజేతలుగా నిలుస్తారని కోదాడ డీఎస్పీ మామిళ్ల శ్రీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం మునగాల మండలంలోని ఆకుపాముల శివారులో గల ఎస్‌ఆర్‌ఎస్ కళాశాలలో నిర్వహించిన పేరెంట్స్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు సరదా కోసం దురలవాట్లకు బానిసయ్యే ప్రమాదం ఉందని, పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మొబైల్ ఫోన్ల వల్ల అనేకమంది నష్టపోతున్నారని, విద్యార్థులు అవసరమైన మేరకే ఫోన్ వినియోగించాలన్నారు. అనంతరం ఎస్‌ఆర్‌ఎస్ కళాశాల చైర్మన్ వడ్డె రాజేష్‌చౌదరి మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణకు తాము అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ రావు, వైస్ ప్రిన్సిపాల్ జీవీ, అధ్యాపకులు, విద్యార్థులు ,తల్లిదండ్రులు పాల్గొన్నారు.